# పరిపూర్తి

(సాహితి - ఆశ్వయుజము - రుధిరోద్గారి - అక్టోబర్ 1923)

## పీఠిక

చంద్రశేఖరరావు వేంకటరత్నముగారికి ఒక్కడే కుమారుడు. వాండ్రు మంచి యాస్తిపరులు. చంద్రశేఖరుడు మెట్రిక్యులేషన్ చదువుచుండగనే యతనికి సంబంధముల మీద సంబంధములు వచ్చినవి. రెండువేలిచ్చెద మన్నవారు మూడు వేలిచ్చెదమన్నారు. చంద్రుడు తాను బి.ఏ.ప్యాసయినగాని వివాహము చేసుకోనన్నాడు. వేంకటరత్నముగారేమి చేయగలడు? వాని యిష్టమన్నాడు. ఆయన భార్య మహాలక్ష్మమ్మగారికి కొడుకు పెండ్లి చూడవలెనని, తన కోడలింటిలో తిరుగుచుండగా చూచి సంతోషించవలెనని యున్నది. కాని చంద్రుడు పట్టువదలలేదు. చంద్రుడు ఎఫ్.ఏ. పరీక్షయయిన తరువాత నా యూరి డిప్యూటి కలెక్టరుగారు నాలుగు వేలిచ్చి పిల్లనిచ్చెదనన్నాడు. చంద్రశేఖరరావుతో చదువుకొన్న రామారావు వారి యింటి ప్రక్కనే - అతడు చెప్పినాడు 'ఆ అమ్మాయి చాల యందముగానుండు'నని. 'నాయనా! ఒప్పుకొమ్మురా!' యని తన గడ్డము పుచ్చుకొని బతిమాలిన తల్లిని 'అమ్మా! ఇక రెండేండ్లేగా! అది యైపోయిన వెంటనే నీయిష్టం వచ్చిన పిల్లని చేసుకొంటాను' అని దాటవేసినాడు చంద్రుడు. వేంకటరత్నంగారు 'ఒరేయ్! చేతులార పాడుచేసుకొంటున్నావు. ఆయన పెద్ద యుద్యోగస్థుడు. ఎక్కడన్నా మంచి యుద్యోగమిప్పిస్తాడు పరీక్షయయిన వెంటనే. పిల్ల రత్నపు మొలకట' అన్నాడు. 'నాన్నగారూ! ఆయన పిల్లను నాకిస్తున్నాడా!? నా ఆస్తికి నా చదువుకి యిస్తున్నాడు. మన యాస్తిమీద నాకేమియు హక్కు లేదనుకొనుడు. నాకు తన కూతురునిస్తాడా? తాను నాలుగు వేలిచ్చునాయెను. నెలకు నలుబది రూపాయలు వడ్డి. ఏ బీదకుఱ్ఱవానినైన, చక్కని తెలివి గలవానిని చూచి యియ్యరాదూ? వాడు హాయిగా సుఖమనుభవిస్తాడుగా!' అన్నాడు చంద్రుడు. అది మొదలు తల్లిదండ్రులు కూమారునితో వివాహముమాట తీసుకురాలేదు.

ఇది పీఠిక ఇక కథ.......

***

## (1)

చంద్రుడు బి.ఏ. ప్యాసయినాడు. అతని కిప్పుడిరువది రెండవయేడు. ఈ యొక్క వివాహ విషయమునదక్క తక్కినయన్ని విషయములలోను తల్లిదండ్రులయందు చంద్రునంత వినయవిధేయతలు గలవారుండరు. అందుచేత వారిరువురు నతని వివాహ మతని యిష్టప్రకారమే చేసుకోనిమ్మని యూరుకొన్నారు. ఒకనాడు చంద్రశేఖరరావేదో పనిమీద నొక పల్లెటూరునకు పోగా నచ్చట తనతో చదువుకొన్న యొక స్నేహితుడు కనపడి భోజనమునకు రమ్మని వారింటికి తీసికొనిపోయెను. భోజనమంత సుష్ఠుగా లేదు. వారిది పేద సంసారము. చంద్రుని స్నేహితుడు స్కూల్ ఫైనల్ పరీక్షయయి యుద్యోగములేక యింట్లో కూర్చున్నాడు. భోజనమైన తరువాత చంద్రుడు అరుగుమీద పరున్నాడు. స్నేహితుడు ఎక్కడికో వెళ్లినాడు. కొంచెముసేపైన తరువాత ఇంట్లో నేదియో పోట్లాటరేగినది. 'గుడ్డి మొద్దువు. నీ మూలముగానే మా దుంప తెగుతోంది. నిన్నెవడు పెళ్ళిచేసుకుంటాడు! పగలు చూస్తే రాత్రిళ్ళు కలలోకి వస్తావు' అని యేమేమో సాగినది. మరికొంతసేపటి కొక గ్రుడ్డిపిల్ల యేడ్చుచు వచ్చి రెండవ యరుగు మీద కూర్చుండి యిట్లనుకొనుచున్నది. "నేను బ్రతికెందుకు, చచ్చేందుకు? నాకు చావైనా రాదాయెను! పీడవదిలి పోవును. అవును, నా మూలముగా వాంద్రందఱికి కష్టముగా నున్నమాట నిజమే! గ్రుడ్డిదానను గాన నన్నెవరు పెండ్లి చేసుకోరారట! వచ్చినా నన్ను చూచి వెళ్ళిపోతారట! రోజును నాకింట్లో యీ దీపారాధనలు తప్పుటలేదు" అని వలవల నేడ్చినది. ఆ యమ్మాయికి పండ్రెండేళ్ళున్నవి. ఆమె బాగా నల్లనిదనియే చెప్పవచ్చును. ఆమె తలవెండ్రుకలు సంస్కారము లేక జడలు కట్టియున్నవి. ఎవరైనా పెండ్లిచూపులకు వచ్చినపుడు వాళ్ళయమ్మ రెండుమూడు సారులు దువ్వినదేమో! ఆమె యొంటిమీద పచ్చని బంగారము లేదు. కాళ్ళకు సత్తు కడియములు, చేతులకు ఇత్తడి మురుగులున్నవి. చూచుటకు ఉప్పరివాళ్ళ పిల్లవలె నున్నది. కాని యామె మొగమున బ్రాహ్మణ జాతిముద్ర లేకపోలేదు. పాప మా పిల్లనింటిలోని తల్లి యొక్కతియేకాదు, ఊరిలోని వారుగూడ తిట్టుచుందురు. అరుగుమీద కూర్చున్నయామె నూరిలోని కొంటెపిల్లలు వచ్చి మొట్టి పోవుచుందురు. ఆమె యేడ్చును. చంద్రుడు ఆమెను నిలువెల్ల పరీక్షించినాడు.

ఆమె మొగము బాష్పకలుషితమై ధూమచ్ఛన్నమై యంధకారబంధుర మయ్యెను, తమాల పల్లవమువలెనే యున్నది. దేహము మాలిన్యయుతమై మాసిన చింపిరిగుడ్డలచేత నసహ్యముగా నున్నను ఆమె యంగసౌష్ఠవము రమ్యవంతముగా కన్పించినది. ఆమె యవయవరేఖలు మనోజ్ఞములుగా నున్నవి. చంద్రుడు నెమ్మదిగా 'అమ్మాయి! నీ పేరేమి?' యన్నాడు. ఆమె తొందరగ లేచి యింట్లోనికి పోబోయినది. లేచి నిలిచినంత నామెను చూడగా చంద్రుని కామెయందు క్రొత్తగా మన్మథుడుదయించిన చిహ్నములు కనపడినవి. చంద్రుడు మెల్లగా 'అమ్మాయి! కూర్చుండుము. నేను మీ యన్నయ్యకు స్నేహితుడనే' అన్నాడు. ఆమె కూర్చుండలేదు గాని యందే నిలుచున్నది.

**చంద్రుడు :** నీపేరేమి? - ఆమె లజ్జపడుచు 'రాధ' యన్నది. చంద్రశేఖరరావును గూర్చి తనయన్న తన తల్లితో చెప్పుచుండగా రాధ విన్నది. బి.ఏ. పరీక్షయైనాడట. మంచి యాస్తిపరుడట. అందగాడట. రాధ యిట్లనుకొని చంద్రశేఖరుని వంకకు మొగము త్రిప్పినది. అతనివంక చూడవలెననుకొన్నది. పాపము తాను గ్రుడ్డిపిల్లనని పేదవారియింటి బిడ్డనని దౌర్భాగ్యురాలనని మఱచిపోయినది. అనేక కాదంబినీ సంపిహితమై యంధకారావృతమైన యాకాశమునందు మెఱపువలె నామె మొగమునందొక తెలివి మెఱసినది. అంతలో నామెకు లజ్జగలిగి యింటిలోనికి పోయినది. కొంతసేపటికి శంకరరావింటికి వచ్చినాడు. ప్రొద్దువాటారగా చంద్రశేఖరుడు ప్రయాణమైనాడు. శంకరరావు సాగనంపుట కూరిబయటదాక వెళ్ళినాడు. తిరిగివచ్చునపుడు శంకరరావు మొగమునందు మంచి యుత్సాహము తోచినది. అతడేమో యాలోచనానిమగ్నుడై యింటికి వెళ్ళినాడు.

**(2)**

చంద్రశేఖరరావు భోజనము చేయుచున్నాడు. రాధ కథ యంతయు చెప్పినాడు తల్లితో. ఆవిడ "అవును నాయనా! దౌర్భాగ్యులెంతమందో యుంటారు" అన్నది.

**చంద్ర :** ఆ అమ్మాయి కెక్కడ నయినా మంచి సంబంధము కుదిరితే?

**తల్లి :** ఎట్లా కుదురుతుంది?

**చంద్ర :** ఏ డబ్బుగలవాళ్ళయినా చేసుకోరాదా? ధనవంతులకు కట్నాలు కావలెననిగాని, ఎందుకు డబ్బు? ఉన్నది చాలదా? చేసుకుంటే బాగానే యుంటుంది. పేదవాళ్ళయితే బ్రాహ్మణులు కాకపోయినారా?

**తల్లి :** మఱి గ్రుడ్డిపిల్లంటున్నావుగా!

**చంద్ర :** మఱి గ్రుడ్డిపిల్లయితే ఏం? సర్వాంగసుందరిని అందరు చేసుకుంటారు, ఇవ్వాలిగాని! ఇటువంటి వాళ్ళను చేసుకుంటేనే మంచివాళ్ళు కావడం.

**తల్లి :** "అంతమంచి వాళ్ళుండొద్దూ నాయనా! ప్రపంచములో?" అన్నది.

చంద్రశేఖరరావు "నేను చేసుకుంటానయితే; అంత మంచివాళ్ళుండటం దుర్లభమని నీవే యనుచున్నావు గదా! నేనంత మంచివాడననిపించుకోవడం నీకిష్టమేగా అమ్మా!" అన్నాడు. పక్కను భోజనము చేయుచున్న వెంకటరత్నం గారు మఱల మాటాడలేదు. మహాలక్ష్మమ్మగారు అసలు మాటాడలేదు.

***

అదృష్టం తోసుకువచ్చుటయన్న "రాధపెండ్లి కథ" యన్నది యా చుట్టుప్రక్కల ఉదాహరణమైనది. ఉభయఖర్చులు చంద్రశేఖరుడుగారివే. పెండ్లి కుమార్తెను చేసినపుడు రాధలో లోపమొక్క గ్రుడ్డితనము తక్క వేఱొకటిలేదు. "నల్లదన మెక్కడ దాస్తావమ్మా" అన్నది అన్నపూర్ణమ్మగారు మొగమద్దముగా త్రిప్పి. "ఇంతకూ అది అదృష్టవంతురాలే" అన్నది సూరమ్మగారు. పెండ్లి యయిదురోజులు జనమొరిగిపోయినారు దంపతులను చూచుటకు. భాషాపరిచయము వలన గలిగిన సౌకుమార్యమును విరజిమ్ముచు, శాంతత్వము విరియు చూపుల ప్రసరింపుచు కరుణారసమునకు పట్టభద్రుని వలె గూర్చుండిన చంద్రశేఖరునివంక చూడలేక పురయౌవన స్త్రీలు త్రొక్కిసలాడిరి.

రాధకు కన్నులు లేకపోయినను ఇల్లంతయు సుపరిచితమే. కన్నులు గలవారివలెనే యామెయు నింటిలో చక్కగా తిరుగగలదు. ఇప్పుడు రాధకు మునుపటి గుర్తు లేమియు లేవు. ఆమె యొక స్థూపమువలె నైనది. చంద్రశేఖరుడు సర్వాంగ సుందరుడు. దయానిధి. శాంతమూర్తి. ఆగర్భశ్రీమంతుడు. ఈ మాట లామె చెవియందు దూరక ప్రతిధ్వనించుచున్నవి. ఆమెను వాళ్ళ తల్లి లేవదీసిన

లేచును. కూర్చుండ పెట్టిన కూర్చుండును. ఊరేగి వచ్చిన తరువాత గడప దాటబోవుచు రాధ పడునదైనది. చంద్రశేఖరుడు తటాలున నామెను కౌగింటబూనినాడు. ఎర్రని యాతని చేయి గగననీలమైన రాధాశరీరమున యొరిపిడి రాతిమీది పదారువన్నె బంగరు గీతవలె మెఱసినది. చంద్రశేఖరుడపుడు "అబ్బా! జాగ్రత" యన్నాడు నెమ్మదిగా. ఆ దయానిలయమైన కంఠధ్వని మఱపునకు రాలేదు జీవితమున్నంతవఱకు రాధకు. రాధ పూర్వము కొంచెము మోటుపిల్ల. మండిగము మీద తూలిపోవునంత సౌకుమార్యమామె కెచ్చటనుండి వచ్చినదో!

పెండ్లికి వచ్చిన వారందరు 'పెండ్లికొడుకు ఏమి యందగాడమ్మా' యనెడువారే. పెండ్లి నాల్గవరోజున సాయంతన మాడువారందరు కూర్చున్నప్పుడు పేరంటాండ్రందరు పెండ్లికొడుకు అందము చెప్పుచుండగా నొక ముసలావిడ "యీపిల్లకు అటువంటి మగడు దొరకుట యదృష్టమే" నన్నది. రాధ మొగము చిన్నవోయింది. ఆ రాత్రి యూరేగింపులో రాధ మొగము విప్పారలేదు. ఈ నాల్గురోజుల నుంచి మహాసంతోషము వెలార్చుచున్న తన యిల్లాలు ఖిన్నయైయుంట చూచి చంద్రశేఖరుడు రాధ తమ్ముని రాముని తొమ్మిదేండ్ల వానిని పిలిచి "మీయక్కయ్య యెందుకురా బిక్క మొగము వేసినది"యని రహస్యముగా నడిగినాడు. అతడు 'మా అక్కయ్య యందకత్తె కాదన్నా రందఱును. అందుకని' అని చెప్పినాడు. ఆ రాత్రియే యందఱును నిద్రవోయిన తరువాత చంద్రశేఖరుడు రాధను నిద్రలేపినాడు. రాధ లజ్జాభయములచేత బెదరిపోయినది. రాధ భయము చంద్రశేఖరుడెరిగి తొందరగా తాను చెప్పవలసిన మాటలు చెప్పదలుచుకొని, రాధ చేయిపుచ్చుకొని "రాధా! భయములేదు. నీతో నొకమాట చెప్పవచ్చితిని. నీవు నేడు దుఃఖితవైనట్లున్నావు. రాముని నడుగగా నీవందకత్తెవు గాదని యన్నారట యందరును అని చెప్పినాడు. నీవు ఖిన్నవై యున్నచో నాకుత్సాహము లేదు. నిన్నందకత్తెవు కాదన్నదెవరు? వారలకేమి తెలియును? నా కన్నులకు నీవు దివ్యాంగనవలె నున్నావు. జగుత్తులో స్త్రీలకు సౌందర్య మెందుకు? భర్త సంతోషించుటకు! నిన్నుకోరి పెండ్లి చేసికొనుచున్న నాకు నీ వన్న సంతోషము లేదని యెవరనగలరు" అని యేమియో చెప్పినాడు. రాధ నెమ్మదిగా వినుచున్నది. కాని యామె దేహము భయము వలన వణకుచునే యున్నది. చంద్రశేఖరుడు

మఱలపోయి తన శయ్యాతలమున నిద్రించకమున్న యానూత్న పుణ్యదంపతుల పెదవులు చుంబనపూర్వకముగా కలసికొనెనేమో యా గాఢనిశీధ సమయమున నెవ్వరికి తెలియును?

చంద్రశేఖరుడు వెళ్లిన తరువాత రాధకు నిదుర పట్టలేదు. రాధ కిదివఱకు తన సౌందర్యమును గూర్చి విచారణ లేదు. ప్రపంచముమీద నున్నయందరు స్త్రీలలో వట్టి వికారస్వరూపిణి తానే ననుకొన్నది. ఇందాక కోపము వచ్చుట కూడ తానందకత్తెను కానని వారెందుకనిరని కాదు. తన్నూరకయేల యనవలెనని. ఇప్పుడు రాధకు తన పూర్వపు భావము తప్పునినట్లు తోచినది, ఇట్లూహ పోయినది. "నన్నందరును వికార స్వరూపిణి నందురు. నా పతి కాదనునేమి? సౌందర్య మెట్లుండును? సౌందర్యము కాని దెట్లుండును? నేను-నలుపేమొ యెఱుపేమొ తెలుపేమొ యెఱుగను. అది తెలిసికొనుటకు కన్నులుండవలెనట. కన్నులతో చూడవచ్చును. నాకవి భగవంతుడు ప్రసాదించలేదు. కన్నులు లేకపోవుటయే యందము లేకపోవుట? అయిన నాకందము లేదన్న మాటయే. నాపతి యందకత్తెవే నీవు అన్నారుగద! కనుక కన్నులు లేకపోయిన అందముగా నుండవచ్చును. కన్నులు లేకపోయిన అందమునకు లోపము కలుగవచ్చును. నల్లగానున్న నందముగా నుండరేమో! నేను నల్లనిదాన నని యందరందురు. నాభర్త నేనందకత్తె నన్నాడు. ఇది యెట్లు? కనుక నల్లదనమ్మును నేత్రహీనత్వమును గలిగిన యందముగా లేదనరాదు. నేనందకత్తెనైయే యుందును. నాకు కనులు లేవు గనుక నాపై నీర్ష్యచేత నన్నందరు వికారిణి వికారిణి యని మోసపుచ్చిరి" అని యిట్టి యూహలతో నిదురపోయెను.

***

తెల్లవారి కొట్నాలు దంపుటయైన తరువాత వధూవరులకు దీక్షావస్త్రములు విప్పించి యభ్యంగస్నానము లాచరింపించినారు. రాధకు తలంటిపోసికొన్న తరువాత సదస్యము నాడు పెట్టిన బరంపురం పట్టుచీర నారింజరంగుది, కట్టినారు. నాడామె యొంటినిండ నగలే. నేడామె యాగర్భ శ్రీమంతుడైన చంద్రశేఖరునకు సహధర్మచారిణి. రాధ కాలు పొడుగుది. చూచినవారికి పదునాలుగేండ్ల పిల్లవలె కనబడును. అదివఱకే వ్యక్తురాలయినదని

కొందరు గిట్టనమ్మలు చెప్పుకొనుచునే యున్నారు. చంద్రశేఖరుడున్న గదిలోనికి రాధయేదో వెదకుచు వచ్చినది. అతడామెను చూచినాడు. ఒక్క కన్నులు లేకపోవుట తక్క యామెలో నే లోపము కనబడలేదతనికి. చంద్రశేఖరుడు రాధచేయి పట్టుకొన్నాడు. అట్లు పట్టుకొన్నది తన ప్రాణేశ్వరుడని రాధకు తెలిసినది. తాను విపన్మహాంబుధిలో కొట్టుకొని పోవుచున్నపుడు తనకు పట్టిచ్చినదే చేయియో, యా చేయియే యిప్పుడామెను పట్టుకొన్నదని యామె గ్రహించినది. రాధ లజ్జాభారమున చేయి విడిపించుకొని పోవలె ననుకొన్నది. ఇంతలో కృతజ్ఞత్వము 'కాదు నిలువు' మన్నది. రాధ భార్యవలె తానప్పుడు లజ్జపడిపోవలెనో, కృతజ్ఞత నెరపి నిలచి నమస్కరింపవలెనో తెలియలేదు. చంద్రశేఖరుడు 'రాధా' అన్నాడు. ఎవ్వరో యింతలో రాగా చంద్రశేఖరుని చేయి వదిలినది.

**(3)**

పెండ్లియైన నాల్గు నెలలలోనే రాధ వ్యక్తురాలైనది. ఇప్పుడు రాధాచంద్రశేఖరులొకరిని బాసి యొక రుండలేరు. రాధ కాపురమునకు వచ్చినది. చంద్రశేఖరుడూరక యుండుట యేలయని యా యూరి పాఠశాలలో యుపాధ్యాయుడుగా నున్నాడు. రాధ యేకోరిక కోరినను నది ప్రొద్దుగ్రుంకక ముందే తీర్పబడును. రాధకిప్పుడు చంద్రశేఖరుని కాలి సవ్వడికూడ నానవాలే. క్రమక్రమముగా రాధకు నూత్నలజ్జ వదలినది. రాధ యిప్పుడు చంద్రశేఖరుని యొడిలో పండుకొని గాఢాంధకారములో తన ప్రాణేశ్వరుని చూచుచున్నట్లుగా అతనివంక మొగము త్రిప్పియున్నది.

**రాధ** : నేనందగత్తెనా?

**చంద్రశేఖరుడు** : మిక్కిలియు నందగత్తెవు.

**రాధ** : నేను నల్లనిదాన నటగా?

**చంద్రశేఖరుడు** : ఎర్రవారి కన్న నల్లవారే యెక్కువ యందముగా నుందురు. కృష్ణమూర్తి నల్లనివాడు. ఆయన భార్య రాధ నల్లనిదే. చంద్రశేఖరుని భార్య రాధకూడ నల్లనిదేయని యతడు చెక్కిలి నొక్కినాడు. రాధ నవ్వినది.

**రాధ** : కన్నులు లేకపోవుట యందమునకు లోపమా?

చంద్రశేఖరుడు నెమ్మదిగా కాదన్నాడు. రాధ గ్రుచ్చిగ్రుచ్చి యడిగినది. చంద్రశేఖరుడు కన్నులు లేకపోవుట సౌందర్యమునకు లోపమేనని యొప్పుకొన్నాడు.

**రాధ** : మీవి చక్కని కళ్ళటగా!

**చంద్రశేఖరుడు** : నాకు తెలియదు. నా కన్నులు నేనెట్లు చూచుకొనగలను?

**రాధ** : నాకు కన్నులు లేవాయెను, మఱి చూచి చెప్పుటకు.

చంద్రశేఖరుడు భార్య నోదార్చినాడు. అప్పటి నుండి రాధకు తానందకత్తెనని దృఢభావ మేర్పడినది. నల్లదనమునకు సౌందర్యమునకు సంబంధము లేదు. నేత్రములు లేకపోవుట లోపమే. ఈ కొఱత తన కెట్లు తీరును?

శ్రావణము వచ్చినది. వర్షములు వెనుక బట్టినవి. మేఘములు తెల్లబడినవి. రాధ మంగళవారము నోము నోచినది. ఎందరో ముత్తయిదువలు సెనగలు వాయనములు పుచ్చుకొనుటకు వచ్చిరి. సావడిలో చంద్రశేఖరుని పెద్ద ఛాయాపటమున్నది. వచ్చినవా రెల్లరునది యెవరిదని యడిగినవారే. అందరును నతని యందమును మెచ్చినవారే! 'చక్రములవంటి కళ్ళు, బంగారునాయన' యన్నదొక ముసలి ముత్తైదువ.

వారి పొరుగుననే యొక పెద్ద యుద్యోగస్థుడున్నాడు. ఆయన కూతురు శ్రావణమాసపు నోములకు పుట్టింటికి వచ్చినది. రాధ యీడుదే. ఆ అమ్మాయి రాధతో రహస్యముగా 'మీవారు చాలా అందంగా ఉంటారు' అన్నది. 'వారి కళ్ళలో నున్నది సిరియంతా' యన్నది.

రాధకు మఱల నేమో సందేహము పుట్టినది. ఆనాడు రాధ కొంచెము బడలికగా నున్నదని పెందలకడనే పోయి గదిలో పడుకున్నది. చంద్రశేఖరుడు భోజనముచేసి గదిలోనికి పోయి రాధను కొంచెమన్నము తినుమని లేపినాడు. రాధలేచి 'నా కాకలి లేదు; మీరు కూర్చుండుడు' అన్నది. నిద్రలో రాధ పూలజడ చుట్ట నలిగిపోయినది. చంద్రశేఖరుడు మంచముమీద తన భార్య నానుకొని కూర్చుండి యామె జడ సవరించుచు 'నీ జడ నలిగిపోయిన'దనెను.

**రాధ** : ఏమి? అందముగా లేదా?

**చంద్రశేఖరుడు** : లేకేమి? అదియొక యందము.

**రాధ** : మీరు చాలా యందగాళ్ళటగా!

**చంద్రశేఖరుడు** : ఎవరన్నారు?

**రాధ** : వాళ్ళమ్మాయి.

**చంద్రశేఖరుడు** : వట్టిపిచ్చిది. నా కన్న నీవు చాల యందగత్తెవు.

**రాధ** : మీ కళ్ళు చక్రాలవలె నుండునట.

చంద్రశేఖరుడు మాటాడలేదు. ఆ యామిని దాటిపోయినది.

రాధకు తాను తన భర్తకన్న కాకపోయినను భర్తతోనైనను సమానముగా నందము గలదాననే యను నూహ యేర్పడినది. ఇంక తన లోపము నేత్రములోననే. చక్రములట. తన కసలు నేత్రములే లేవాయెను. అట్టి నేత్రములెచ్చటినుండి వచ్చును? కన్ను లేనిది కలియుగమే లేదన్నారు. నాకీ జన్మకింతియ కాబోలును. నా భర్తకున్న కన్నులు నా కుండరాదా? ఆ మనోహరుని పాదకమలములు నా నేత్రపుష్పములతో పూజింతునే. ఇంతకు కన్నులున్న దయారాశి నన్నీ వివాహ మాడుటయే తటస్థింప కుండెడిదేమో? నాకు కన్నులు లేకపోవుట నా దురదృష్టము నదృష్టము రెండును. నాకు కన్నులేయున్న మా అమ్మ తిట్టనే తిట్టదు. ఈయన యరుగుమీద పరుండి యవి విననవే వినరు. నాకింత గీత యెట్లు వ్రాసినాడు బ్రహ్మ! నాకు కన్నులు కూడ పెట్టినాడు కాదు పాపిష్ఠిదేవుడు. నాకు కన్నులే యుండిన నా సౌందర్యము పూర్తియయ్యెడిదా? ఇప్పుడీ కొరంత యెట్లు తీరును? ఈ నా సౌందర్య లోపమునకు పరిపూర్తియున్నదా? ఇప్పుడు నా కేమియు లోపము లేదు. దయాంభోధియగు నా భర్త కారణంబున నేను స్వర్గ మనుభవించుచున్నాను. నా కోరిన కోర్కియెల్ల నా భర్త తీర్చుచున్నాడు. నా యీ కోర్కె కూడ తీర్చలేడా? నేను పరిపూర్ణ నగుదునే. నేను గ్రుడ్డిదాన నయిపోతిని. నాకు కన్నులు రావా?

**(4)**

ఎడతెఅపిలేని మహాప్రణయ యాత్ర రాధా చంద్రశేఖరుల మధ్య నొక సంవత్సర మవ్యవహితముగా గడచినది. మఱల వర్షాకాలము వచ్చినది. రాధ కట్టుకోకముడి యెడమైనది. చాకలిది మహాలక్ష్మమ్మగారితో చెప్పినది. అది మొదలత్తగారు కోడలిని కాలు క్రింద పెట్టనీయలేదు. ఈ సంగతి యయిదవ నెలలోగాని చంద్రశేఖరునకు తెలియలేదు. ఇరువు రేకాంతమున నున్నప్పుడు చంద్రశేఖరుడు రాధనొక మహారహస్య మడిగినాడు. ఆమె లజ్జారుణిత కపోలయై యూరకొన్నది.

ఒకనాడు శంకరరావు తన చెల్లెలిని తీసికొని పోవుటకు వచ్చినాడు. అప్పుడు చంద్రశేఖరుడింటిలో లేడు. మహాలక్ష్మమ్మగారు వెంకటరత్నముగారును

పంపించుట కాలోచన చేసినారు. పంపించిన బాగుండునేమో యనుకొన్నారు. కాని చంద్రశేఖరుడు వచ్చిన తరువాతనే యోజించవచ్చు ననుకొన్నారు.

మఱునాడు చంద్రశేఖరుడు వచ్చినాడు. భోజనము చేసిన తరువాత, గదిలో మంచముమీద పతి కూర్చుండగా రాధ తమలపాకు లీనెలు తీసి యిచ్చుచున్నది.

**చంద్రశేఖరుడు :** మీ అన్నయ్య వచ్చినాడెందుకు?

రాధ యూరకున్నది.

**చంద్రశేఖరుడు :** నిన్ను తీసికొని వెళ్ళుటకా?

రాధ కన్నుల నీరు పెట్టుకొన్నది.

పతి భార్యను దగ్గరకు దీసికొని కన్నీరు తుడిచినాడు.

**రాధ :** మిమ్ము నేను వదలిపెట్టి యుండలేను.

**చంద్రశేఖరుడు :** నిన్ను వదలిపెట్టి నేను నుండలేను.

తరువాత రాధ తల్లికూడ వచ్చి యల్లుని యింటిలో నీ యిబ్బంది పోవువఱకు నుండునట్లేర్పాటు చేయబడినది.

ఇదివఱకెన్నడు రాధాచంద్రశేఖరుడు ఫొటోగ్రాపు తీయించుకొనలేదు. ఆనాడు ఫొటోగ్రాపు తీయువానిని పిలుచుకు వచ్చినాడు చంద్రశేఖరుడు. రాధ కన్నులకు సులోచనములు పెట్టినాడు.

మూడునాళ్ళయిన తరువాత ఫొటోగ్రాపు వచ్చినది. ఇంటిలో నందరును ఛాయాపటమునుచూచి రాధకు కన్నులున్నట్లే యున్నదన్నారు.

భార్యాభర్తలేకాంతములో......

**రాధ :** నా బొమ్మ బాగుగా నున్నదా?

**చంద్ర :** చాల బాగున్నది.

**రాధ :** నేను నల్లగా లేనా?

**చంద్ర :** మనిసి నలుపో యెఱుపో ఛాయాపటమున కనబడదు.

రాధ కిప్పుడు మఱియు బాగుగా తెలిసినది. నల్లదనమునకు నందమునకు సంబంధము లేదని.

**రాధ :** సులోచనములు పెట్టినారు గదా! నా కన్నులెట్లున్నవి?

**చంద్ర :** నీకు కన్నులున్నట్లే యున్నవి.

రాధకెక్కడలేని సంతోషము వచ్చి కాంతుని జబ్బుగా కౌగిలించినది. చంద్రశేఖరుడు ప్రేమావేశముచేత తన ప్రాణప్రియను గాఢాలింగన మాచరించినాడు. కఠోర గర్భిణియైన రాధకా బిగికౌగిలింత కించిద్బాధాజనకమైనది. ఆమె 'అబ్బా!' యన్నది. చంద్రశేఖరుడు మనస్సు నొచ్చుకొని తన మనోరథము ఆకారము పొందెనా యన్నట్లున్న తన భార్యాగర్భము తన చేతితో తడవినాడు.

*'పరాం కోటిం స్నేహే పరిచయవికాసా దధిగతే*
*రహో విస్రబ్ధాయా అపి సహజలజ్జాకులదృశః*
*మయైవాదౌ జ్ఞాతః కరతలపరామర్శకలయా*
*ద్విధా గర్భగ్రంథి స్తదను దినసైః కై రపి తయా'*

అన్నాడు శ్రీరామచంద్రుడు. కరతల పరామర్శ వలన చంద్రశేఖరుడు తన సంతానమును గుర్తించినట్లే యున్నాడు. రహోవిస్రబ్ధయైన రాధయు నభ్యంతర పెట్టలేదు.

రాధ సుఖప్రసవమైనది. బొడ్డుకోయునపుడు మంత్రసాని "ఏమయ్యా! అప్పుడే పత్తివిత్తులవలె కళ్ళు తెఱచినావు" అన్నది. పురుష సంతానము. రాధ యీ మాట విని తన జన్మసఫలమైన దనుకొన్నది.

నెలపురుటిలో నడుముకట్టు, నెత్తిమీద బాలెంతముసుగు, పెదవి మీద తాంబూలము, నిట్టి మనోహర మూర్తితో రాధ తన బిడ్డ నొకనాడు రహస్యముగా భర్త కందిచ్చినది. చంద్రశేఖరుని పెదవికి –ముద్దు పెట్టుకొనుటలో తన కుమారుని యొడలికి పూసిన యాముద మంటినది.

**రాధ :** అబ్బాయి యెట్లున్నాడు ?

**చంద్ర :** మూడుమూర్తుల నీవే.

**రాధ :** అబ్బాయి కళ్ళో ? అచ్చముగా మీ కళ్ళవలెనే యున్నవటగా! అందరు చెప్పుచున్నారు.

**చంద్ర :** అబ్బాయి, నీకు కళ్ళు వచ్చినట్టులున్నాడు.

మహానందమున రాధ బిడ్డ నందిపుచ్చుకొనుటలో భార్యభర్తల పెదవులు కలిసినవి.